క్లుప్తంగా

వాహనాల పన్నులు చెల్లించకపోతే చర్యలు


మాట్లాడుతున్న ఏ.ఎస్.ఎన్ రెడ్డి

నందికొట్కూరు: మోటారు వాహనాలకు తక్షణమే పన్నులు చెల్లించకపోతే చట్ట పరమైన చర్యలు తప్పవని మోటారు వాహనాల తనిఖీ అధికారి ఏ.ఎస్.ఎన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను కట్టకపోతే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలకు రూ.200 జరిమాన విధించడం ఖాయమన్నారు. స్వచ్ఛందంగా వాహనదారులు మీకు దగ్గరలో ఉన్న మీ సేవా, ఏపీ ఆర్టీసీ సిటిజన్, ఈ ప్రగతి వెబ్సైట్ ద్వారా పన్నులు చెల్లించాలని కోరారు.

అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నందికొట్కూరు క్లస్టర్ సీడీపీఓ యస్.కోటేశ్వరీ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముసలిమడుగు గూడెం మినీ అంగన్‌వాడీ కేంద్రంలో వర్కరుగా పనిచేయుటకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 22వ తేదీ లోపు వారి దరఖాస్తును నందికొట్కూరు కార్యాలయంలో అందించాలని సూచించారు. అభ్యర్థులు ఎస్టీ కులమునకు చెందిన వారై, 10వ తరగతి పాసై ఉండాలన్నారు. 1-07-2023 నాటికి 21 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాలలోపు వారై ఉండాలని వెల్లడించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వరం 'అవిశ్రాంత కానుక'


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ డీఎం, ఉద్యోగులు

నందికొట్కూరు: ఆర్టీసీ ఉద్యోగులకు అ విశ్రాంత కానుక ఓ వరం లాంటిదని డిపో మేనేజర్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ అవిశ్రాంత కానుక కింద ఆర్టీసీ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ పథకంలో నమోదు చేసుకోవడం జరిగిందని చెప్పారు. ఉద్యోగులకు మేలు చేసిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు

మిడుతూరు: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాసపేట, దేవనూరు, కడుమూరు, పీరుసాహెబ్ పేట, చింతలపల్లి గ్రామంలో మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయిలో సందర్శించి, పంటసాగులో సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పైరును ఆశించే కత్తెర పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు హుసేన్ బాషా, దేవకుమార్ పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే ఉపేక్షించం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలో ఎక్కడైనా, ఎవరైనా నాటుసారా తయారు చేస్తే ఉపేక్షించేదిలేదని సెబ్ సీఐ జి.నాయుడు, కొత్తపల్లి ఎస్ఐ హుస్సేన్ బాషా హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని పాలెంచెరువుగూడెం సమీపంలోని నల్లమల అటవీలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటుసారా బట్టీని, 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని వారు చెప్పారు. నాటుసారా బట్టీ గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన బోయ హుసేనయ్య, బోయ లింగస్వాములుగా గుర్తించామన్నారు. వారిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. దాడుల్లో కానిస్టేబుళ్లు ప్రసాద్‌నాయక్, హరినాథ్, సెబ్ సిబ్బంది ఉన్నారు.

రైతన్నకు అండగా ఆర్బీకేలు

- ఉన్న గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాల సరఫరా
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ
- పలు రకాల సేవలతో పాటు ఈ-క్రాప్, పంటల బీమా నమోదు
- మద్దతు ధరతో దిగుబడుల కొనుగోళ్లు



ఆత్మకూరు: రైతన్న సంతోషంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందని, రైతే రాజని వారి సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని తన తండ్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో రైతన్నల సంక్షేమానికి కృషి చేస్తామని ఎన్నికల ముందు పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారం లోకి రాగానే వాటిని నేర్చారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎంతో ఊరట కల్పించడమే కాకుండా వారి చెంతకే అన్ని రకాల సేవలను అందజేస్తున్నారు.

నిత్యం అందుబాటులో సిబ్బంది

రాష్ట్రంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల నందు రైతులకు సబ్సీడీలో ఎరువులు, విత్తనాలు అందించడమే కాకుండా వ్యవసాయ పనిముట్లను, ట్రాక్టర్లను అందజేస్తున్నారు. ఆర్బీకేల్లో వ్యవసాయ సిబ్బంది రైతులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అలాగే ఏడాది పొడవునా సాగు చేసే ఖరీఫ్ , రబీ పంటలకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్, పంటల బీమా, పంటలు గిట్టుబాటు ధరల విక్రయించుకునేందుకు నమోదు చేస్తున్నారు. అంతే కాకుండా అతివృష్టి, అనావృష్టి ప్రభావాలకు పంటలు దెబ్బతింటే వ్యవసాయ సిబ్బంది గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు..

పుష్కలంగా ఎరువులు

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని ఆర్బీకేల్లో రైతులకు ఎరువుల నిలువలు అందుబాటులో ఉన్నాయి. ఆత్మకూరు మండలంలోని ఆర్బీకేల్లో 749.99 క్వింటాళ్లు, వెలుగోడు మండలంలో 59.96 క్వింటాళ్లు, పాములపాడు 299.93, కొత్తపల్లి 272, బండిఆత్మకూరు 299.92, మహానంది మండలంలో 40 క్వింటాళ్ల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభమైనందున రైతులు రైతు భరోసా కేంద్రాల్లోనే రసాయనిక ఎరువులు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఆత్మకూరు డివిజన్ పరిధిలో రైతు భరోసా కేంద్రాల వివరాలు

మండలం	ఆర్బీకేలు
ఆత్మకూరు	12
వెలుగోడు	11
పాములపాడు	03
కొత్తపల్లి	11
బండిఆత్మకూరు	14
మహానంది	11

రైతులకు శిక్షణ కార్యక్రమాలు

రైతన్నలు వ్యవసాయం సాగు చేసే సమయంలో పంటలు దెబ్బతినకుండా అధిక దిగుబడి సాధించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఉచితంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పంటలకు చీడ, పీడ సోకితే తీసువాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాల నుంచి ఎలా లబ్ధిపొందాలో అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా రైతుల పొలాల్లో మట్టినమూనాలు సేకరించి, పరీక్షలు చేయించి ఫలితాల ఆధారంగా ఎరువులు ఎంత మోతాదులో వాడాలో వివరిస్తున్నారు.

సొంత ఊరిలోనే ఎరువులు కొనుగోలు చేస్తున్నాం



రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసి నాలుగేళ్లు గడిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసే సమయంలో ఎరువులను గ్రామాల్లోనే కొనుగోలు చేస్తున్నాం. అక్కడే విత్తనాలు కూడా కొంటున్నాం. గతంలో ఆత్మకూరు పట్టణానికి వెళ్లి ఎరువులు తెచ్చుకునేవాళ్లం. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రం సొంత ఊరిలో ఉండడం వలన వ్యయప్రయాసలు తప్పాయి.

– వెంకటసుబ్బయ్య, నల్లకాల్వ

దళారుల బెడద తప్పింది



గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఏ పంట వేస్తున్నాం, ఎంత విస్తీర్ణం లో పంట సాగు చేస్తున్నాం, అన్ని వివరాలను నమోదు చేస్తారు. ఇంకా ప్రభుత్వ మద్దతు ధరలతో సొంత ఊరిలో పంటలు కొనుగోలు చేయడం వలన దళారుల బెడద తగ్గింది. ఆర్బీకే వలన ఎన్నో ప్రయోజనాలను కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు.

–వెంకటరమణ, బాపనంతపురం

రైతులకు అందుబాటులో వ్యవసాయ సిబ్బంది



ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఆర్బీకేల్లో రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రతి గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తారు. పొలం పనులకు రైతులు వెళ్లే లోగా సిబ్బంది కూడా అక్కడికి చేరుకుని వారికి కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందించడమే కాకుండా పంటకు సోకే తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

– ఆంజనేయులు , ఏడీఏ,ఆత్మకూరు

బండిఆత్మకూరు ఎస్ఐగా మల్లికార్జున


ఎమ్మెల్యే శిల్పాను కలిసిన ఎస్ఐ మల్లికార్జున

మహానంది: బండిఆత్మకూరు ఎస్ఐగా కె.మల్లికార్జున బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ బాబు నంద్యాల త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. కర్నూలు జిల్లా చిప్పగిరి స్టేషన్‌లో పనిచేస్తున్న మల్లికార్జునను బండిఆత్మకూరు స్టేషన్‌కు బదిలీ చేయగా బుధవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

గ్రామాల్లో విత్తనాలు, పురుగు మందులు అమ్మరాదు


శివపురంలో ఫర్టిలైజర్ షాప్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: గ్రామాలలో ఉన్న ఫర్టిలైజర్ షాపులలో విత్తనాలు, పురుగుల మందులు అమ్మకూడదని ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రమఠం, శివపురం రైతు భరోసా కేంద్రాలను, ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయాధికారి కె.మహేష్‌తో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎర్రమఠం గ్రామంలో ఆర్‌బీకేలో రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న వ్యవసాయ సంబంధ పథకాలపై అవగాహన కల్పించారు. కౌలుకార్డుల ఆవశ్యకత, సీహెచ్‌సీ గ్రూపుల ఆవశ్యకత, గ్రూపుల ద్వారా ఏపీ వ్యవసాయ పరికరాలు ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తుందో వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ గౌరమ్మ, ఆర్బీకే సిబ్బంది మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయండి


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వంగాల భరత్‌కుమార్ రెడ్డి

మిడుతూరు: మండలపరిధిలోని తలముడిపి గ్రామంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని నంద్యాల జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి బుధవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 2021 సంవత్సరంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అయితే ఈ స్థలం పాఠశాలకు సంబంధించినదని కొందరు కేసు వేయడంతో, కోర్టు స్టే ఇవ్వడంతో స్థలాల పంపిణీ నిలిచిపోయిందన్నారు. దీంతో ఇళ్లు లేక పేదలు అవస్థలు పడుతున్నారని అన్నారు. కోర్టు పరిధిలో ఉండి ఇళ్ల పట్టాలు నిలిచిపోయిన స్థానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేరే భూములు తీసుకొని పేదలకు పంపిణీ చేసే విధంగా ఆదేశించారన్నారు. ఈ మేరకు గ్రామంలో ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతును శాస్త్రవేత్త చేయడమే పొలంబడి లక్ష్యం


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో పవన్ కుమార్

వెలుగోడు : పంట కాలంలో 14 వారాల పాటు శిక్షణ ఇచ్చి రైతును శాస్త్రవేత్తను చేయడమే వైఎస్సార్ పొలంబడి లక్ష్యమని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అన్నారు. ఖరీఫ్ 2023నకు మండలంలోని మోతుకూరు, బోయ రేవుల గ్రామాల్లో వరి పంటలో పొలంబడికి ఎంపిక చేశారు. బుధవారం పొలంబడి కార్యచర ప్రణాళికలను యాప్‌లో నమోదు చేశారు. పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఎంపిక చేసిన పంటలో 14 వారాల పాటు 25 మంది రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. నిరంతర పంటల పరిశీలన ద్వారా మిత్ర పురుగులు, వాతావరణాన్ని పరిశీలిస్తూ అవసరమైన నిర్ణయాలపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. గ్రామ రైతులందరూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో నిర్వహించే పొలంబడికి పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నాగలింగం, నాగేంద్ర, రామలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయండి


భాస్కరాపురంలో జీఎల్ఆర్ ట్యాంకును శుభ్రం చేయిస్తున్న ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని తాగునీటి ఓవర్‌హెడ్, జీఎల్ఆర్ ట్యాంకులను పక్షం రోజులకోపర్యాయం తప్పనిసరిగా శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని భాస్కరాపురం గ్రామంలో పర్యటించి తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. గ్రామంలోని ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించారు. అలాగే ట్యాంకుపై బ్లాక్‌పెయింట్ వేయించి శుభ్రం చేసిన తేదీని నమోదు చేయించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీటి అపరిశుభ్రత, దోమల వ్యాప్తి వల్ల అంటువ్యాధులు అధికంగా వ్యాపించే అవకాశాలున్నాయన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడరు చల్లిస్తున్నట్లు తెలిపారు.

పూర్తి స్థాయిలో ప్లాంటేషన్ పనులు చేయించాలి

కొత్తపల్లి: హార్టీకల్చర్ సాగులో భాగంగా రైతులతో పూర్తిస్థాయిలో ప్లాంటేషన్ పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 156 మంది రైతులకు 250 ఏకరాల్లో పండ్లతోటల పెంపకం చేసుకునేందుకు ఆదేశాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం 25 ఎకరాలలో రైతులు హార్టీకల్చర్ కింద వివిధ పండ్లతోటల పెంపకం చేస్తున్నారని చెప్పారు. ఇంకా మిగిలిన రైతులతో పూర్తిస్థాయిలో పండ్లతోటల పెంపకం చేసుకునేలా చూడాలన్నారు. వికలాంగులకు గ్రామాలలో పనులు కల్పించాలని ఆదేశించారు. కొండ ప్రాంతంలో సీడ్ డిబ్లింగ్ కార్యక్రమం కింద తాటి, వేప మొక్కలు నాటించేందుకు ఉన్నతాధికారులను ఆదేశాలు వచ్చాయని, ఆ పనులను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాధార పంటలను సాగు చేసుకోవాలి

మహానంది: మండల రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కేవలం వర్షాధార పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని, వరి పంట వేసుకోవద్దని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి సూచించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఆర్‌డీఓ ఆదేశాల మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్ కాల్వకు వస్తున్న నీరు నంద్యాలతో పాటు కాలువ పరిసర గ్రామాల ప్రజలకు తాగునీటి కోసం మాత్రమే వినియోగిస్తారని చెప్పారు.

అర్హులందరికీ పనులు కల్పిస్తాం

మహానంది: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ వసుధ తెలిపారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యాన, అవెన్యూ ప్లాంటేషన్, హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో తొంభై రోజుల పనిదినాలు, ఆధార్ సీడింగ్, వంద పనిదినాలు కల్పించడంపై సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ఆత్మకూరు: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ చెన్న కేశవరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా ఆత్మకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశామని చెప్పారు. రికార్డులు పరిశీలించామని ఎలాంటి అవకతవకలు లేవన్నారు. కార్యాలయం పాతభవనం ఉండడం వలన రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ఆత్మకూరు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ సూర్యకుమారి బుధవారం తెలిపారు. ఆత్మకూరు - 2వ కేంద్రంలో ఒక పోస్ట్ ఖాళీ ఉందని ఓసీకి కేటాయించినట్లు చెప్పారు. వెలు గోడు మండలం అబ్దుల్లాపురంలో 1 (బీసీ-డి), బండిఆత్మకూరు మండలం ఎ.కోడూరులో 1 బీసీ-బీ, బోదనంలో 1 బీసీ-బీ కి కేటాయించామన్నారు. మహానంది మండలం గాజులపల్లెలో 1 పోస్ట్ ఎస్సీ, సీతారామాపురం- 02 లో ఒక పోస్ట్ బీసీ-సీ రిజర్వ్ చేసినట్లు చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కరోనా సమయంలో ధైర్యంగా ఇంటింటికి వెళ్లి....


అరుణకుమారికి ఆరోగ్యసిబ్బందితో సలహాలు, సూచనలు ఇప్పిస్తున్న వలంటీరు సుధీర్

కరోనా సమయంలో ఇళ్లల్లోంచి బయటకు వచ్చేందుకు ప్రజలు వెనకడుగువేశారు. అలాంటి ప్రాణాపాయ సమయంలో కూడా పారుమంచాల గ్రామానికి చెందిన పుటిక సుధీర్ ధైర్యంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో పాటు అవ్వా, తాతల చేతుల్లో పింఛన్ నగదు అందించాడు. వైద్య, ఆరోగ్య సిబ్బందిని వెంటబెట్టుకొని తన పరిధిలో ఉన్న 70కుటుంబాల వారికి కరోనా మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించాడు. వ్యాధిలక్షణాలు కనిపించిన వారి వివరాలు వైద్యులకు తెలియజేసి వెంటనే వారిని క్వారంటైన్‌కు తరలించి వారికి ప్రాణహాని కలగకుండా చేశాడు. విపత్కర పరిస్థితుల్లో కూడా తన పరిధిలో ఉన్న 20మంది పింఛన్‌దారులకు తెల్లవారకముందే సొమ్ము అందిస్తూ వారి ఆదరాభిమానాలను చూరగొన్నాడు. –జూపాడుబంగ్లా

ఏ పథకం అమలైనా వెంటనే తెలియజేస్తాడు



ప్రభుత్వం కొత్తగా ఏ పథకం మంజూరు చేసినా మా వలంటీరు సుధీర్ మాకు వెంటనే తెలియజేస్తాడు. కరోనా సమయంలో నిరంతరం మమ్మల్ని అప్రమత్తం చేస్తూ ఇళ్లల్లోంచి ఎవ్వరూ బయటకు రాకుండా చేయటంతో పాటు మాకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. ఎప్పటికప్పుడు వైద్యులను, వైద్యసిబ్బందిని ఇంటికి తోలుకొని వచ్చి మా క్షేమ సమాచారాలు తెలుసుకునేవాడు. అమ్మఒడి, రైతుభరోసా, వైఎస్సార్‌ఆసరా వంటి సంక్షేమ పథకాలు మాకు అందేలా చేశాడు.

– అరుణకుమారి, పారుమంచాల

జగనన్న మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర


జిలానీని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి 2024లో సీఎం కావాలని కోరుతూ ప్రజాసంకల్పయాత్ర పేరుతో ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ జిలానీ మార్కాపురం నుంచి పాదయాత్ర చేపట్టారు. బుధవారం పాదయాత్ర ఆత్మకూరు చేరుకుంది. ఈ సందర్భంగా షేక్ జిలానీని పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు అర్బన్ రైతు భరోసా కేంద్రం చైర్మన్ షేక్‌మహబూబ్‌బాషా దుశ్శాలువా, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. జిలానీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలో ప్రజా సమస్యలు తెలుసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి ప్రజా బలం ఉందని, వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యం అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిమోతి, రఫిక్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి

జూపాడుబంగ్లా: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని ఏఐటీయుసీ కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. బుధవారం ఆయన జూపాడు బంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకు అనుకూలంగా పేదల శ్రమను వారికి దోచిపెడుతోందన్నారు. కార్మికుల చట్టాలను తుంగలోతొక్కి కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా మారిందని విమర్శించారు. ఆగస్టు 9న విజయవాడలో జరిగే హర్తాల్‌కు కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు మగ్బూల్‌బాషా, సలీం, రాజు, వలి తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప కు మన ప్రభుత్వం' వాయిదా

ఆత్మకూరు: మండల పరిధిలోని కొత్తరామాపురం గ్రామంలో బుధవార జరగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వాయిదా వేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ తుపాను ప్రభావం వలన వర్షం కురవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు చెప్పారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లోని గాజులపల్లె-2 సచివాలయం, శింగవరం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెండు గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారన్నారు.

నేడు చెలిమిల్లలో..

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ బుధవారం తెలిపారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడం జరుతుందన్నారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం పట్టణంలో పర్యటిస్తారని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తెలిపారు. పట్టణంలోని 2వ సచివాలయ పరిధిలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు.

26న మండల సర్వసభ్య సమావేశం

వెలుగోడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 26వ తేదీ మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

విస్తారంగా వర్షాలు


జూపాడుబంగ్లా వద్ద పచ్చగా ఉన్న మొక్కజొన్న పైరు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో వరుసగా రెండు రోజుల నుంచి చిరుజల్లుతో ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం ఆత్మకూరు మండలంలో 0.09 మి.మీ, కొత్తపల్లి 10.8 మి.మీ, వెలుగోడు 12.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం కురవడంతో పంటలకు జీవం పోసినట్లైంది

జూపాడుబంగ్లాలో12.4మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షం 12.4మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల్లో అత్యధికంగా 12.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పగిడ్యాలలో 4.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నందికొట్కూరులో 9.4 మిమీ వర్షం కురిసిందన్నారు. ఖరీఫ్ విత్తనాలు సాగుచేసుకొని మొలకెత్తిన పంటలకు వర్షం వర్షం ఊరటనిచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు.

తేలికపాటి వర్షం

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు నాగలూటి, పీరుసాహెబ్ పేట, చింతలపల్లి, చెరుకుచెర్ల, మాసపేట, చౌట్కూరు, చింతలపల్లి, దేవనూరు తలముడిపి, తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. తేలికపాటి వర్షం కురియడంతో బోరు బావుల కింద సాగు చేపట్టిన మొక్కజొన్న, పత్తి, మిరప, ఉల్లి తదితర పంటలకు ఆశాజనకంగా ఉంటుంది.

మహానందిలో అత్యధిక వర్షపాతం

మహానంది: మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. మంగళవారం రాత్రి బుధవారం రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో మండలంలో 13.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

6.8 మిల్లీ మీటర్ల వర్షపాతం

పాములపాడు: మండలంలో బుధవారం తెల్లవారుజామునుంచి కురుస్తున్న వర్షం 6.8మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో ఇప్పటికే పొలాల్లో వేసిన విత్తనాలు మొలకెత్తాయి. పొలంలో మొక్కలు కళకళ లాడుతున్నాయి.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు


ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

నందికొట్కూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులైనవారిలో ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అందరికీ ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన కార్యక్రమమే జగనన్న సురక్ష అని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయం ఆర్.ఐ శ్యామలదేవి, ఎలక్షన్ డీటీ కిషోర్, కౌన్సిలర్లు రాధిక, షేక్ నాయబ్, కో ఆప్షన్ సభ్యుడు గఫార్, జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్ తదితరులు పాల్గొన్నారు.